జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

# జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 68 ॥ మంగళవారం ॥ 4-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

04 ఆగస్టు 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:59 సూర్యాస్తమయం - సా. 6:44 తిథి షష్ఠి రా. 9:59 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం రేవతి రా. 9:54 వరకు తరువాత అశ్విని యోగం ధృతి రా. 7:26 వరకు కరణం గరజి ఉ. 10:30 వరకు వనిజ రా. 9:59 వరకు వర్జ్యం ఉ. 9:57 నుండి ఉ. 11:33 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:24 వరకు రా. 11:14 నుండి రా. 11:59 వరకు రాహుకాలం మ. 3:33 నుండి సా. 5:08 వరకు యమగండం ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు గుళికాకాలం మ. 12:22 నుండి మ. 1:57 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:23 నుండి తె. 5:11 వరకు అమృత ఘడియలు రా. 7:29 నుండి రా. 9:04 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: “o” అనగా మరుసటి రోజున



## బీహార్‌లో బిజెపికి అతిపెద్ద షాక్

### బంకీపూర్ అసెంబ్లీలో ప్రశాంత్ కిశోర్ భారీ విజయం

**30 ఏళ్ల కంచుకోటను బద్దలు కొట్టిన ప్రశాంత్**

బిహార్‌లో సరికొత్త రాజకీయం ఆవిష్కృతం అయ్యింది. అలాగే బిజెపికి అతిపెద్ద షాక్ తగిలింది. బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా బిజెపికి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు. ప్రశాంత్ కిశోర్ తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించారు.

పాట్నా,ఆగస్టు 3 : ఉదయం కౌంటింగ్ మొదలైనప్పటి నుంచీ బీజేపీ నేత నీరజ్ కుమార్ కంటే ముందంజలో ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక్కో రౌండ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకున్నారు. పీకేకు 63,203 పోలయ్యాయి. అలానే రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ కు 44,250, మూడో స్థానంలో నిలిచిన ఆర్జేడీ అభ్యర్థి రేఖ కుమారి 14,085 ఓట్లు సాధించారు. ఈ చరిత్రాత్మక విజయం అనంతరం ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. తన గెలుపు బీజేపీ హైకమాండ్‌కు ఒక బలమైన సందేశమని వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తిని బిహార్ ముఖ్యమంత్రిగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, సామ్రాట్ చౌదరిని వెంటనే సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపఎన్నిక ఫలితం బిహార్ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభకు ఎన్నికైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. బంకీపూర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. బీజేపీ కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో.. 1995 నుంచి బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ అసాధారణ విజయం సాధించడం, బీజేపీ కంచుకోటలో జేఎస్‌పీ జెండా ఎగురవేయడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. ప్రశాంత్ విజయంతో.. జేఎస్పీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి.



## డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం

**డేటా ఆధారిత నిర్ణయాలపై సమీక్ష**

**అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం చంద్రబాబు**

అన్ని శాఖల్లో డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌టీజీఎస్‌లో డేటా ఆధారిత నిర్ణయాలపై సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

అమరావతి,ఆగస్ట్3: డేటా డ్రివెన్ మేకింగ్ డెసిషన్‌పై అధికారులకు సీఎం మార్గనిర్దేశర చేశారు. సీఎం సమీక్షకు ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఐటీ, ఆర్‌టీజీఎస్, వ్యవసాయం, మున్సిపల్, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆర్‌టీజీ తరువాయి 2 వ పేజీలో..





## ఎన్ఆర్ఐలకు భట్టి ఆహ్వానం

### మూడు ట్రిలియన్ డాలర్ల తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపు

**అమెరికాలో ఏటీఏ మహాసభల్లో ఉపముఖ్యమంత్రి ప్రసంగం**

**సింగిల్ విండో విధానంలో వేగవంతమైన అనుమతుల హామీ**

**విద్య, మౌలిక వసతుల అభివృద్ధిలో సహకరించాలని విజ్ఞప్తి**

అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం బాల్టిమోర్ నగరంలో నిర్వహించిన 19వ అమెరికా తెలుగు సంఘం జాతీయ మహాసభల్లో తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విదేశాల్లో స్థిరపడి వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలు సాధించిన ప్రవాస భారతీయులు తమ సొంత రాష్ట్రం, గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బాల్టిమోర్ (అమెరికా), ఆగస్టు 3: తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే ప్రవాస భారతీయులకు సింగిల్ విండో విధానం ద్వారా వేగవంతమైన అనుమతులు అందజేస్తామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. వారు చేపట్టే పారిశ్రామిక, సామాజిక సేవా కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం తరువాయి 2 వ పేజీలో..



## ఎల్ నినో.. కాదు కుంభవృష్టి!

**అగ్నిప్రమాదాలు, ప్రాణనష్టం తప్పవు**

**ఆర్నెల్లలో విగ్రహ ప్రతిష్ఠ చేయాల్సిందే**

**లష్కర్ బోనాల్లో ‘రంగం’ భవిష్యవాణి**

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో లష్కర్ బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ‘రంగం’ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. మాతంగి స్వర్ణలత పచ్చి మట్టికుండపై నిలబడి అమ్మవారి తరపున భవిష్యవాణి వినిపించారు.

సికింద్రాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): ఈ ఏడాది తాను తీవ్ర ఆగ్రహంతో ఉన్నానని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నానని అమ్మవారు తన వాణిలో హెచ్చరించారు. ప్రజల -2 వ పేజీలో...

## కాంగ్రెస్ హామీలపై కేటీఆర్ విమర్శలు



**జాబ్ క్యాలెండర్ అమలుపై ప్రభుత్వానికి ప్రశ్నలు**

**ఇంజినీర్లపై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్**

**నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి**

**అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టీకరణ**

హైదరాబాద్, ఆగస్టు 3: తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగుల పరిస్థితి, ఇంజినీర్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసినట్లు పేర్కొన్న వ్యాఖ్యలు, విద్యార్థుల సమస్యలు, కాళేశ్వరం, సాగునీటి అంశాలు, మెట్రో, రాష్ట్ర పాలన తదితర అంశాలపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో యువతలో తీవ్ర నిరాశ నెలకొందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలులో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా స్పష్టమైన చర్యలు తీసుకోలేదన్నారు. రెండేళ్ల కాలంలో పదివేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గానికి చెందిన ఓ నిరుద్యోగ యువకుడు ఉద్యోగాలపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యాయత్నానికి తరువాయి 2 వ పేజీలో...

BRICS
INDIA 2026

## హైదరాబాద్‌లో బ్రిక్స్ సమావేశాలు

**బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందానికి భారత్ ఆతిథ్యం**

**ఆస్తుల రికవరీ, సీమాంతర అవినీతిపై సభ్య దేశాల చర్చలు**

**పారదర్శక, సాంకేతిక ఆధారిత పరిపాలనపై ప్రత్యేక సదస్సు**

2



## 1000 రోబోటిక్ సర్జరీలు

**మూడేళ్లలోనే నిమ్స్ అరుదైన ఘనత.. ప్రభుత్వ దవాఖానల్లో సరికొత్త రికార్డు**

**90 శాతం సర్జరీలు ఉచితంగానే.. వైద్యులకు రేవంత్, దామోదర అభినందనలు**

నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య రంగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. మూడేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే 1000 రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఇదొక నూతన రికార్డు అని, సామాన్యులకు సైతం అత్యాధునిక రోబోటిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రభుత్వం పేర్కొంది.

హైదరాబాద్, ఆగస్టు 3: ఈ అద్భుత ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్, యూ రాల ఓజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభా గం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరా జ్‌తో పాటు యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎం టరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ, నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని సీఎం రేవంత్ రెడ్డి (నిమ్స్ పాలకమండలి అధ్యక్షుడు) ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 1000 శస్త్రచికిత్సలలో తరువాయి 2 వ పేజీలో...

## నేటి రాశి ఫలాలు

**మేషం:** చిన్ననాటి మిత్రులతో కారణ కలహ సూచనలున్నవి. అనారోగ్య సమస్యలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. సంతాన విద్యా ఫలితాలు నిరుత్సాహ పరుస్తాయి. దైవ అనుగ్రహంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూరప్రయాణ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

**వృషభం:** చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఋణదాతల నుండి ఋణ ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు అధికారులతో నూతన సమస్యలు కలుగుతాయి. ఆర్థికంగా నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

**మిథునం:** సమాజంలో పరిచయాలు పెరుగుతాయి. మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక వృద్ధి కలుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు అమలు పరుస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి.

**కర్కాటకం:** చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. విలువైన వస్తులాభాలు పొందుతారు. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

**సింహం:** ముఖ్యమైన పనులు మధ్యలో నిలిచిపోతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం ఉండదు. సన్నిహితులతో మాటపట్టింపులుంటాయి. మిత్రుల నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు చికాకు పరుస్తాయి.

**కన్య:** చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. వృథా ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయట పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

**తుల:** బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సంతానం పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి. ఉద్యోగులు అదనపు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**ధనస్సు:** నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశాలు పొందుతారు. కుటుంబ పెద్దల ఆదరణ పెరుగుతుంది. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. అవసరానికి చేతిలో డబ్బు నిలువక నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

**మకరం:** ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఇంటా బయట ఒత్తిడి వలన మానసిక సమస్యలు కలుగుతాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో చిన్నపాటి వివాదాలు తప్పవు.

**కుంభం:** దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థికపరంగా అనుకూలత సాధిస్తారు. నూతన వస్తు, వస్త్రలాభాలు పొందుతారు. చిన్ననాటి స్నేహితులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగమున జీత భత్యాల విషయంలో శుభఫలితాలు పొందుతారు.

**మీనం:** చిన్ననాటి మిత్రులతో గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగమున మీ పని తీరుకు అధికారుల నుండి గుర్తింపు పొందుతారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వ్యాపారాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు.



# కాంగ్రెస్ హామీలపై కేటీఆర్ విమర్శలు

మొదటి పేజీ తరువాయి

పాల్పడటం బాధాకరమని పేర్కొన్నారు. ఆ యువకుడు రాసిన లేఖ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

నిరుద్యోగ యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు కోల్పోవడం సమస్యలకు పరిష్కారం కాదని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడాలని సూచించారు. విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో ఉద్యోగాల భర్తీకి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఇంజినీర్లపై ముఖ్యమంత్రి చేసినట్లు పేర్కొన్న వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకమని, హైదరాబాద్‌లోని వంతెనలు, ఆధునిక భవనాలు, నీటిపారుదల ప్రాజెక్టులు, ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక వసతుల నిర్మాణం అన్నీ ఇంజినీర్ల కృషి ఫలితమేనని చెప్పారు. దేశ విదేశాల్లో ప్రతిభ చాటుతున్న తెలంగాణ ఇంజినీర్లను అవమానించేలా మాట్లాడడం సరికాదన్నారు. ఇంజినీర్ల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆరోపించారు. విద్యార్థులపై లాఠీచార్జీలు జరుగుతున్నా కాంగ్రెస్ అగ్రనాయకత్వం స్పందించడం లేదని విమర్శించారు. గురుకుల విద్యాసంస్థల పరిస్థితి, విద్యా హక్కు చట్టం అమలు, బీసీ రిజర్వేషన్లు, ఐటీ రంగంలో ఉద్యోగాల తగ్గుదల, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, గోదావరి జలాల వినియోగం వంటి పలు అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇతర విషయాలపై దృష్టి మళ్లిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలను పూర్తిస్థాయిలో నిర్వహించి నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు, ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలను ప్రభుత్వ ముందుంచుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వాటిని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నిస్తామని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐలకు భట్టి ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

కట్టుబడి ఉందని పేర్కొన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ లక్ష్య సాధనలో పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగం, సేవారంగం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో 56 కిలోమీటర్ల మేర మూసీ నది ప్రక్షాళన, ఔటర్ రింగ్ రోడ్డుకు ఆవల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో 'ఫ్యూచర్ సిటీ' అభివృద్ధి వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ ఆర్థికాభివృద్ధికి కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని, రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో విద్యాసంస్థను 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామని, ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. ప్రవాస భారతీయులు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చట్టబద్ధ అధికారాలు కలిగిన ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు





తీసుకుంటోందని భట్టి విక్రమార్క తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తెలంగాణను తీసుకెళ్లే కృషిలో ప్రవాస భారతీయులు తమ అనుభవం, పెట్టుబడులు, నైపుణ్యంతో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి



ద్వారా పాలన మరింత సమర్థవంతంగా, సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలతో డేటా వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. ఆయా శాఖల వారీగా డేటా సమన్వయంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఇకపోతే కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి సకాలంలో పన్నుల వాటా కేటాయిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్ర సహకారంతో ఏపీలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన విడుదలయ్యే పన్నుల వాటాతో పాటు అదనంగా రూ.4,597 కోట్ల పన్నుల వాటా కేటాయించారని వెల్లడించారు. రాష్ట్ర పన్నుల వాటాను కేంద్రప్రభుత్వం సకాలంలో కేటాయించడంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలం చేకూరుస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. అదనపు పన్నుల వాటా విడుదలతో ఏపీలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతున్నాయని ఉద్ఘాటించారు. కేంద్రప్రభుత్వం ఏపీ అభివృద్ధికి నిరంతరం అందిస్తున్న సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతగానో దోహదపడుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఎల్ నినో.. కాదు కుంభవృష్టి!

మొదటి పేజీ తరువాయి

ప్రవర్తన తనను కంటతడి పెట్టిస్తోందని, మనశ్శాంతి లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యవాణిలో స్వర్ణలత మాట్లాడుతూ.. 'నా విగ్రహ ప్రతిష్ఠ చేస్తానని మాటిచ్చి నిలబెట్టుకోలేదు. అయినా ప్రజలను నేను కాపాడుతూనే ఉన్నా. ఏ ఆపద వచ్చినా అడ్డుకుంటున్నా. కానీ నా మాట మీరు వినడం లేదు. ఇది నాకు ఆగ్రహం తెప్పిస్తోంది. ఈ ఏడాది కుంభవృష్టి రూపంలో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని, వాటి వల్ల ప్రాణనష్టం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు వావివరసలు మరిచి ప్రవర్తిస్తున్నారు. ఘోరాలు చేస్తున్నారు. వారిని నేను వదిలిపెట్టను' అని చెప్పారు. తనకు ఇచ్చిన మాట ప్రకారం రాబోయే ఆరు నెలల్లోగా విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేయాలని అమ్మవారు ఆదేశించారు. అలా చేయని పక్షంలో భారీ ప్రాణనష్టం జరిపిస్తానని హెచ్చరించారు. 'నాకు అడ్డు వచ్చిన వాళ్లను పాదాల కింద వేసి నలిపేస్తా. మీరు గాలికి వదిలేసిన పిల్లల్ని నేను కాపాడుతా. కానీ మీరు నన్ను నిరుత్సాహపరుస్తున్నారు' అంటూ అమ్మవారి వాణిని వినిపించారు.

## 1000 రోబోటిక్ సర్జరీలు

మొదటి పేజీ తరువాయి

యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకాలజీ 162 సర్జరీలు నిర్వహించాయి. వీటిలో 90 శాతానికి పైగా ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా ఉచితంగా అందించడం గమనార్హం. రాడికల్ ప్రోస్టేటెక్టమీ, రాడికల్ సిస్టెక్టమీ, క్లిష్టమైన రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోబోటిక్ శస్త్రచికిత్సల వల్ల కచ్చితత్వం మెరుగుపడుతుందని, శస్త్రచికిత్స అనంతరం నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు వేగంగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. సామాన్య పౌరులకు అత్యుత్తమ వైద్య సేవలను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొంటూ నిమ్స్ బృందాన్ని ప్రశంసించారు.

# హైదరాబాద్‌లో బ్రిక్స్ సమావేశాలు

**బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందానికి భారత్ ఆతిథ్యం**

**ఆస్తుల రికవరీ, సీమాంతర అవినీతిపై సభ్య దేశాల చర్చలు**

**పారదర్శక, సాంకేతిక ఆధారిత పరిపాలనపై ప్రత్యేక సదస్సు**

**ఆగస్టు 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో సమావేశాలు**

హైదరాబాద్, ఆగస్టు 3 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): బ్రిక్స్--2026కు అధ్యక్షత వహిస్తున్న భారత్ ఆధ్వర్యంలో బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం (ఏసీడబ్ల్యూజీ) రెండో సమావేశం, ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశం ఆగస్టు 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్నాయి. కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం (డీవోపీటీ) ఈ సమావేశాలకు ఆతిథ్యం ఇస్తోంది. బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు, విధాన రూపకర్తలు, అవినీతి నిరోధక సంస్థలు, చట్ట అమలు సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశాల్లో పాల్గొననున్నారు. "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే బ్రిక్స్--2026 ప్రధాన ఇతివృత్తానికి అనుగుణంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా సమావేశాలను ప్రారంభించనున్నారు. అవినీతి నిరోధం, పారదర్శక పరిపాలన, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడంపై సభ్య దేశాలు విస్తృతంగా చర్చించనున్నాయి.

ఈ సమావేశంలో ముఖ్యంగా సీమాంతర అవినీతి నిరోధం, అక్రమంగా తరలించిన ఆస్తుల రికవరీ, అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నేరస్తుల ఆచూకీ గుర్తింపు, అప్పగింత ప్రక్రియలను వేగవంతం చేసే అంశాలపై చర్చలు జరగనున్నాయి. అలాగే బ్రిక్స్ ఆస్తుల రికవరీ నిపుణుల నెట్‌వర్క్ ద్వారా సమాచార మార్పిడి, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణను రూపొందించనున్నారు. ఆర్థిక సాంకేతికత, డిజిటల్ ఆస్తులు, అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థల వల్ల ఏర్పడే అవినీతి సంబంధిత ప్రమాదాలను ఎదుర్కోవడంపై కూడా సభ్య దేశాలు అనుభవాలు పంచుకోనున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అవినీతిని అరికట్టేందుకు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకునే అంశంపై కూడా చర్చించనున్నారు.

ఆగస్టు 5న "ఆవిష్కరణ, సాంకేతిక





ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన" అనే అంశంపై ప్రత్యేక అనుబంధ సదస్సు నిర్వహించనున్నారు. డిజిటల్ ప్రభుత్వ కొనుగోళ్ల వ్యవస్థ, పౌర భాగస్వామ్యం, పారదర్శకత, జవాబుదారీతనం, సాంకేతిక ఆధారిత పరిపాలనలో అమలు చేస్తున్న వినూత్న విధానాలను సభ్య దేశాలు ఈ వేదికపై పంచుకోనున్నాయి. ప్రజా పరిపాలనలో సాంకేతికత పాత్రను మరింత బలోపేతం చేయడంపై చర్చలు సాగనున్నాయి. బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న భారత్ నేతృత్వంలో నిర్వహిస్తున్న చివరి అవినీతి నిరోధక కార్యాచరణ బృంద సమావేశం ఇదే కావడంతో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సమావేశాల ద్వారా సభ్య దేశాల మధ్య ఆచరణాత్మక సహకారం మరింత బలోపేతం కావడంతో పాటు, ఆస్తుల రికవరీ, సీమాంతర అవినీతి నిరోధం, సాంకేతిక ఆధారిత పరిపాలన, సంస్థాగత సామర్థ్యాల పెంపులో దీర్ఘకాలిక సహకారానికి బలమైన పునాది ఏర్పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

శ్వేత

# సంపాదకీయం

మంగళవారం 4-8-2026

# హామీలను మోసగిస్తున్న పాలకులు!

తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తోంది. ప్రధాన సమస్యలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా ధరణి విషయంలో ఎన్నో చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటికీ దీనిపై స్పష్టత లేదు. ఎన్ని భూములు అన్యాకాంత్రం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించుకుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కెసిఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం కూడా విఫలమయ్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఎపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు. ఇకపోతే కాళేశ్వరంపై విమర్శలు తప్ప ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునే ఆలోచన చేయడంలేదు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై గందరోగళం జరుగు తోంది. దీనిని సజావుగా పరిష్కరించడం లేదు. కోర్టుల్లో కేసులు కూడా దాఖలు అయ్యాయి. జర్నలిస్టులు ఇంటిస్థలాలు, ఆరోగ్య కార్డులు ఊసే లేదు.

ఇప్పటికే ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేటాయించిన 70 ఎకరాల భూమిని కాజేసే కుట్రలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపి, వేలకోట్ల విలువ చేసే భూమిని లాగేసుకుని, జర్నలిస్టులకు మొడిచేయి చూపేందుకు రంగం సిద్దం చేశారు. ఇందులో కొందరు జర్నలిస్టుల పాత్రకూడా ఉంది. జర్నలిస్టులకు అన్యాయం చేయడంలో టిడిపి ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం కూడా ఎపిలో ఇదే తరహా పోకడలు సాగించింది. ఇక అన్నింటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య. మొన్నటికి మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు మద్దతు తెలిపిన రాహుల్, రేవంత్ రెడ్డిలు తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఇక్కడా అలాంటి ఉ ద్యమం వస్తే తప్ప వీరు స్పందించేలా లేరు. క్యాలెండర్లు మారాయి కానీ కొలువులు మాత్రం రావడలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఇటీవలే సిఎం రేవంత్ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అంటే ఆయన ఇచ్చిన హామీని ఆయనే నెరవేర్చలేదని చెబుతున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు రెండేండ్లు పూర్తయినా.. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నోటిఫికేషన్లపై మాట తప్పిన సర్కార్ మీద నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. నాలుగువేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి.. ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. జాబ్ క్యాలెండర్ జాడ లేదు. నిరుద్యోగ భృతి ఊసులేదు. 'ఇదిగో మా నిబద్ధత..' అంటూ 2024 ఆగస్టు 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టారు. 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఈ క్యాలెండర్ గడువు కూడా ముగిసింది. కానీ, అందులో పేర్కొన్న ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. 2025 ఆగస్టు 2,శనివారంతో 2026 ఆగస్టు 2 కూడా గడిచిపోయింది.రెండేండ్ల గడువు పూర్తయ్యింది. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు విలువ లేకుండా పోయింది. నిరుద్యోగ యువతను తమవైపు తిప్పుకొనేం దుకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. దీనిని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. కానీ, డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఉద్యోగాలొచ్చే వరకు యువతకు నెలకు రూ. 4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా కాంగ్రెస్ నేతలు మరచిపోయారు. అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదు.

రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్న హామీని పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా దాదాపు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. వీరితోపాటు విద్యుత్తు సంస్థలు, పలు బోర్డులు, విభాగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో 14వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. యూనివర్సిటీల్లో 2వేలకుపైగా బోధన, మరో 2,800 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గురుకులాల్లో ఆరువేలు, ఆర్టీసీలో మూడువేలకుపైగా, పోలీసుశాఖలో 17వేలకుపైగా ఖాళీలున్నాయి. ఎక్సైజ్ శాఖలో వెయ్యి, అంగన్‌వాడీల్లో 15వేలకుపైగా, మైనారిటీ సంక్షేమ శాఖలో మూడువేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా పలు శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలున్నా సర్కార్ నోటిఫికేషన్లు విడుదల చేయడంలేదన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. మరోవైపు రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండటం గమనార్హం. మూడు లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీనికి గత కెసిఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి. ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసి, అలా అనలేదని బుకాయించారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెట్టుమీద ఆకులతో ఇస్తార్లు కుట్టినట్లు లెక్కలు చెప్పారు. ఏతావాతా ఎవరు అధికారంలోకి వచ్చినా తమ స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని తేల్చారు. అలు కెసిఆర్, రేవంత్, చంద్రబాబు, జగన్ ఎవరైనా ప్రజలు మాటలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరారు.

# జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్

**సమగ్ర విచారణ జరపాలంటూ విద్యార్థుల డిమాండ్**

**నిరాహారదీక్షకు దిగిన విద్యార్థులు..మద్దతుగా ఆందోళన**

**ఆందోళనకు మద్దతు తెలిపన కాక్రోచ్ నేత అభిజిత్ దీప్కే**



రాంచీ,ఆగస్ట్3 : నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని దిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతాపార్టీ మద్దతు ప్రకటించింది. జేపీఎస్సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం అని స్టేడియంలోని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక పక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుందని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో పేపర్ లీకైనట్టు ఆరోపణలు రావడంతో అక్కడి విద్యార్థులు గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజాగా ఝార్ఖండ్ విద్యార్థులకు మద్దతు ప్రకటించింది. దేశరాజధాని రాంచీలో ప్రస్తుతం విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. పేపర్ లీక్ ఉదంతంపై దర్యాప్తు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహాతో ఆదివారం ఆమరణ దీక్ష ప్రారంభించారు. వారాల తరబడి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మహాతో ఆరోపించారు. కమిషన్, ప్రభుత్వం తీరుతో విద్యార్థుల మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్స్‌కు ఆమోదం తెలిపే వరకూ తన దీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో టీడీపీఎల్ ద్వారా జరిగిన పరీక్షలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఎగ్జామ్‌లోనైనా పేపర్ లీక్ జరుగుతూనే ఉందని ఒక విద్యార్థులు మండిపడ్డారు. ఈ విషయాలపై సీఎం హేమంత్ సోరెన్ తమతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

# నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్

**ఉద్యోగాల భర్తీ పేరుతో ఆటలాడుకున్నారు**

**నిరుద్యోగ నియామకాలు, భృతి హామీల విస్మరణ**

**యువత ఆందోళనలను పట్టించుకోని కాంగ్రెస్**

**మీడియా సమావేశంలో మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్**

హైదరాబాద్,ఆగస్ట్3 : రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను సిఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టిందని విమర్శించారు. జాబ్‌లు భర్తీ చేయకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కెటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20వేల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉంటే.. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడమేంటన్నారు. ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావాలని.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అంటున్నారు. ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడు తున్నారని మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించరా..? యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చి ఒక్కటైనా నెరవేర్చిందా..? అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్ అంటూ విమర్శలు గుప్పించారుఉ. సీఎం రేవంత్ రెడ్డి ఏం చదివారో కూడా నాకు డౌటే. ఆయన ఎన్నికల నామినేషన్ పత్రం సొంతంగా నింపుకోగలరా?. ఆయన ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా..?' అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో యువత తీవ్ర నిరాశలో ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని యువత ఒక రకమైన నిర్వేదంలో ఉందన్నారు. దేశ రాజకీయాలను గమనిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ విషయం అర్థమవుతోందని.. ఎన్నికల సమయంలో యువతను వాడుకోవడం కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అలవాటుగా మారిందన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ను ప్రస్తావిస్తూ.. రెండేళ్ల క్రితం కూడా ఉద్యోగాల భర్తీపై హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రచార సభల్లో ఇచ్చిన హామీలకు విలువ లేకపోయినా, కనీసం శాసనసభలో ఇచ్చిన మాటకైనా విలువ ఉండాలని అన్నారు. ఇటీవల ఖమ్మంలో వేణు అనే విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనను ప్రస్తావించిన కేటీఆర్.. అతడు రాసిన సూసైడ్ నోట్‌లో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేరే వరకు షేర్ చేయాలని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ లేఖలో తమను కూడా ప్రస్తావించారని, అయితే అది సాధారణ సూసైడ్ నోట్ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాసిన చార్జ్‌షీట్‌లాంటిదని అన్నారు. అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన ఉద్యోగ హామీలను గుర్తు చేస్తూ.. ఉద్యోగాలు ఇవ్వకపోతే రాహుల్ గాంధీ ఇప్పుడు తెలంగాణకు ఎందుకు రావడం లేదు.? ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో అక్కడికి వెళ్లరు.. కానీ తమ ప్రభుత్వం లేని రాష్ట్రాల్లో మాత్రం రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరుగుతారంటూ విమర్శించారు.




# పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

**ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా**

**19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ డిమాండ్**

హైదరాబాద్,ఆగస్ట్3 : తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ పక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.




# విమానాశ్రయ నిబంధనల మేరకే వైజాగ్ పేరు

**ప్రజల్లో అపోహలు తొలగించాలి**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు పిలుపు**

విజయనగరం, ఆగస్టు 3: శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి విమానాశ్రయ నిబంధనలు మేరకే వైజాగ్ పేరు పేర్కొనడం జరుగుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన మీడియా సమావేశంలో పలు విషయాలను మంత్రిగారు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ సివిల్ ఏవియేషన్ అథారిటీ సూచనల మేరకు భోగాపురం అని కాకుండా వైజాగ్ పేరు పలకటం జరుగుతుందనీ, పేరుపై అపోహలను మీడియా మిత్రులు తొలగించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. మనకు సమీపంలో ఉన్న శంషాబాద్ ఎయిర్పోర్ట్ విషయానికి వస్తే రంగారెడ్డి జిల్లాలో ఉన్నప్పటికీ హైదరాబాద్ లేదా శంషాబాద్ విమానాశ్రయం అని పేర్కొనడాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. రెవెన్యూ పరంగా విజయనగరం జిల్లాలో భోగాపురం విమానాశ్రయం ఉన్నప్పటికీ వైజాగ్ అని పిలవడంలో తప్పులేదని నిబంధనల మేరకే వైజాగ్ పేరు ప్రస్తావించడం జరుగుతుందని గమనించాలన్నారు. భోగాపురం విమానాశ్రయంలో ఇప్పటికే 70% స్థానికులకే బ్లూ కాలర్ జాబులు ఇవ్వటం జరిగిందని, వైట్ కాలర్ జాబులకు కావలసిన అర్హత, అనుభవంతో పాటు నేర్పరితనం కోసం వేరే వారిని నియమించడం జరుగుతుందనీ, ఉద్యోగ విషయాలలో కూడా అపోహలు వద్దని మరొక్కసారి జీఎంఆర్ సంస్థతో మాట్లాడటం జరుగుతుందన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సూపర్ సక్సెస్ కావడంలో భాగస్వాములు అయిన ప్రతి ఒక్కరికి కూడా ప్రత్యేకించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. జిల్లా అధికారి స్థాయి నుండి గ్రామస్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరు చాలా బాధ్యతతో పనిచేయడంతో పాటు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు కూడా ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందన్నారు. మన ప్రాంతానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ గారికి అపూర్వ స్వాగతం పలకాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఇచ్చిన పిలుపుమేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి, ముఖ్యంగా మీడియా మిత్రులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

**విపక్ష సభ్యుల ఆందోళన మధ్య చర్చ లేకుండానే ఆమోదం**

న్యూఢిల్లీ,ఆగస్ట్3: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు.





# ఎయిర్పోర్ట్ ప్రారంభ ప్రస్థానంలో కలెక్టర్ గారు కీలక పాత్ర

## కలెక్టర్ రామ సుందర్ రెడ్డి గారికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు అభినందనలు

విజయనగరం, ఆగస్టు 3: శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభ ప్రస్థానంలో కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి గారు కీలకపాత్ర పోషించారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ గారి కార్యాలయం నందు కలెక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డి గారిని కలిసి శాలువాతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోడీ గారి విమానాశ్రయ ప్రారంభం షెడ్యూల్ విడుదలైన నాటి నుండి పగడ్బందీగా ఏర్పాట్లు చేయడం, కృత నిశ్చయంతో విధులు నిర్వహించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి ఆదేశాల మేరకు, యువ నాయకులు నారా లోకేష్ గారి సారధ్యంలో, ప్రత్యేక పరిశీలకులు, మంత్రుల సూచనలు పాటించి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేయటంతోనే ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా ప్రారంభ కార్యక్రమాన్ని పూర్తి చేయగలిగామని ప్రశంసించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులకు, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు అభినందనలు తెలిపారు.

# ఫొటోగ్రఫీ పోటీల్లో భాగస్వాములుకండి..

**ఎంట్రీలకు ఈ నెల 5వ తేదీ గడువు**

**మూడు విభాగాల్లో ప్రపంచ ఫొటోగ్రఫీ డే పోటీలు**

**ఔత్సాహికులు పోటీలను సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ఈ నెల 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేయనున్నామని, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 6 గంటలులోగా ఎంట్రీలు సమర్పించాలని, గడువు పొడిగింపు ఉండదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా పరిధిలోని ఫొటో జర్నలిస్టులు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, స్టూడియో ఫొటోగ్రాఫర్లు పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని.. మొదటి విభాగంలో జిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ వారసత్వం, పర్యాటకం, సంస్కృతి అంశాల్లో ఫొటో ఎంట్రీలు పంపొచ్చన్నారు. రెండో విభాగంలో యువత, పీ4, ఆర్థికాభివృద్ధి-సంక్షేమం అంశాలు, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతి గా రూ. 10 వేలు,ద్వితీయ బహుమతి కింద రూ. 7 వేలు తృతీయ బహుమతి గా రూ. 4 వేలు నగదు బహుమతులతో పాటు రూ. 2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక విభాగం నుంచి మూడు ఫొటోలు, అదేవిధంగా మొత్తం మూడు విభాగాల నుంచి తొమ్మిది ఫొటోలు పంపవచ్చన్నారు. 2025, జూన్ 12 నుంచి 2026, జులై 31 మధ్య తీసిన ఫొటోలై ఉండాలని.. ఫొటో సైజు 12x10 ఉండాలని, ఫొటోలు ఎన్‌టీఆర్ జిల్లాలో మాత్రమే తీసి, పబ్లిసిటీకి మాత్రమే ఉపయోగించేవిగా ఉండాలని వివరించారు. వాటర్ మార్క్, మార్ఫింగ్ వంటి వాటిని అనుమతించడం జరగదని.. ఉత్తమ ఫొటోల ఎంపిక విషయంలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని తెలిపారు.ఒరిజినల్ ఫొటో ఎంట్రీలను డీపీఆర్‌వో కార్యాలయం, స్టేట్ గెస్ట్ హౌస్, విజయవాడ-520002 చిరునామాకు నేరుగా లేదా పోస్టల్ ద్వారా సమర్పించవచ్చన్నారు. ఇతర వివరాలకు కె.రవి, డివిజనల్ పీఆర్‌వో (9010156550)ను సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# సింగరేణికి డీప్‌సైడ్ కోల్ బ్యాక్ దక్కడం సంతోషకరం

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**



న్యూఢిల్లీ,ఆగస్ట్3 : డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. ఖఐక్షఅ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు. తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం వేలం పక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్లు ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే ఉ-8 బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఇండియా స్కిల్స్ పోటీలకు సిద్ధం కండి..!

**ఇండియా స్కిల్స్ పోటీల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలి**

**63 నైపుణ్యాల విభాగాల్లో ప్రతిభ చాటుకునే సువర్ణావకాశం**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




దేశవ్యాప్తంగా యువతలో నైపుణ్యాలను వెలికితీసి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటేందుకు ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ ఒక గొప్ప వేదికగా నిలుస్తోందని.. ఈ పోటీల్లో యువత పెద్దసంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ (2026--27) పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో తప్పనిసరిగా పాల్గొని తమ ప్రతిభను జాతీయ స్థాయిలో చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో మొత్తం 63 విభిన్న నైపుణ్య విభాగాల్లో విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు **https://www.skillindiadigital.gov.in/home** ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నైపుణ్యాలే ఉపాధికి, స్వయం ఉపాధికి, ప్రపంచ స్థాయి అవకాశాలకు పునాదిగా నిలుస్తాయని పేర్కొన్న కలెక్టర్, యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ పోటీలు అత్యుత్తమ అవకాశమన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు తమ విద్యార్థులకు ఈ సమాచారాన్ని విస్తృతంగా తెలియజేసి, ఎక్కువ సంఖ్యలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, డా. కొల్లేటి రమేష్, డా. జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.




## డీఎంహెచ్‌వోకు మద్దతుగా ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తమ్ రెడ్డికి వినతి

**సూర్యాపేట, ఆగస్టు 3**

సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో) డా. పెండెం వెంకట రమణకు పరిపాలనా పరంగా పూర్తి సహకారం అందించాలని కోరుతూ పబ్లిక్ హెల్త్ ఢ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ--3194) ప్రతినిధులు ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సూర్యాపేటలోని వైట్ హౌస్‌లో జిల్లా అధ్యక్షుడు రామసాని మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు సర్వోత్తమ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, డా. పెండెం వెంకట రమణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన సారథ్యంలో శాఖలో పారదర్శకత, జవాబు దారీతనం పెరిగి సానుకూల పరిపాలనా వాతావరణం నెలకొన్నట్లు పేర్కొన్నారు. అయితే, కొందరు వ్యక్తులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం డీఎంహెచ్‌వోపై నిరాధార ఆరోపణలు చేస్తూ అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇటువంటి చర్యలు వైద్య ఆరోగ్య శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించడమే కాకుండా ప్రజలకు అందుతున్న సేవలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని నిష్పక్షపాతంగా, సమగ్రంగా విచారించి, ఆధారాలు లేని ప్రచారా లను అరికట్టడంతో పాటు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న డా. పెండెం వెంకట రమణకు తగిన పరిపాలనా రక్షణ, సహకారం అందించాలని వినతిపత్రం ద్వారా కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల ఆందోళనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాస్తవాల ఆధారంగా న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, ఆగస్టు 3**

ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులన్నింటినీ తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, కొత్తగా అందుతున్న వినతులను వెంటనే నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలు సమర్పించిన అర్జీలను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 117 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో భూ సమస్యలకు సంబంధించినవి 59, మహిళా, శిశు సంక్షేమ శాఖ (డీడబ్ల్యూఓ)కు 10, పంచాయతీ శాఖ (డీపీఓ)కు 7, వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్‌వో)కు 6, మిగిలిన 35 దరఖాస్తులు వివిధ శాఖలకు సంబంధించినవి ఉన్నాయని తెలిపారు. అన్ని దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్ఓ ప్రేమ్‌రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, సీపీఓ కిషన్, డీఈఓ అశోక్, డీపీఓ యాదగిరి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# ప్రజల విశ్వాసమే నా బలం: చిగురింత పారిజాత

## చిగురింత పారిజాత జన్మదిన వేడుకల్లో శ్రీ సాయి బాలాజీ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

బలాపూర్, నమస్తే తెలంగాణ, ఆగస్టు 2: బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మాజీ మేయర్ శ్రీమతి చిగురింత పారిజాత జన్మదిన వేడుకల సందర్భంగా శ్రీ సాయి బాలాజీ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ -- ఫేజ్-1 ప్రతినిధులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరి కిషోర్, కోశాధికారి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంప్రసాద్ పాటు కాలనీ నివాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలైన రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను మాజీ మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ ప్రజల సమస్యలను సానుకూలంగా విన్న ఆమె సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి తన 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ, ప్రజాసేవే తన రాజకీయ జీవితానికి మూల సూత్రమని, ప్రజల విశ్వాసం, ప్రేమాభిమానాలే తనకు అతిపెద్ద బలమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని తెలిపారు. అనంతరం బడంగ్ పేట శ్రీ సాయి బాలాజీ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆమె, కాలనీ అభివృద్ధికి సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. ప్రజల భాగస్వామ్యంతోనే కాలనీల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుం దని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు మాజీ మేయర్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు

# లిఫ్ట్ పేరుతో దోపిడీ

- **ఆల్వాల్‌లో ఆరుగురు యువకులను అరెస్టు చేసిన పోలీసులు**
- **కత్తితో బెదిరించి నగదు, డిజిటల్ చెల్లింపులు దోచుకున్నట్లు ఆరోపణ**
- **కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింపు**

**హైదరాబాద్, ఆగస్టు 3**

ఆల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లిఫ్ట్ ఇస్తామని నమ్మించి ద్విచక్ర వాహనదారుడిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దోపిడీకి పాల్పడిన ఆరుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడిని కత్తితో బెదిరించి నగదు, డిజిటల్ చెల్లింపుల ద్వారా డబ్బు దోచుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు ముందుగా బాధితుడిని లిఫ్ట్ పేరుతో తమ వెంట తీసుకెళ్లారు. అనంతరం జనసంచారం లేని ప్రాంతానికి చేరుకున్న తర్వాత కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.5,000 నగదును లాక్కున్నారు. అంతటితో ఆగకుండా డిజిటల్ చెల్లింపు వేదిక ద్వారా మరో రూ.800 తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారం ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన ఆరుగురిని విచారించగా దోపిడీ ఘటనలో వారి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి దోపిడీకి ఉపయోగించిన ఒక కత్తితో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను కేసు నమోదు పత్రాల్లో చేర్చి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు చేపట్టారు. అరెస్టు చేసిన నిందితులను వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నగరంలో ఇలాంటి నేరాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పద వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లిఫ్ట్ పేరుతో అపరిచితులను నమ్మి ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు ప్రజలకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా అత్యవసర సేవల ద్వారా సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

## స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

- **కలెక్టర్ అంకిత్ అధికారులతో సమీక్ష సమావేశం**

**కొత్తగూడెం, ఆగస్టు 3:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ప్రభు త్వ శాఖలు సమన్వయంతో పనిచేయాల ని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం ప్రగతి మైదా నంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పా ట్లపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రధాన వేదిక నిర్మాణం, ప్రోటోకాల్‌కు అనుగుణంగా అతిథుల సీటింగ్ ఏర్పా టు, బ్యారికేడ్లు, వాహనాల పార్కింగ్, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం, మొబైల్ మరుగుదొడ్లు, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వాటర్‌ప్రూఫ్ టెంట్లు, జనరేటర్లు, ధ్వని వ్యవస్థ, లైటింగ్, ఎల్ఈడీ తెరలు వంటి అన్ని మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వేడుకల సందర్భంగా భద్రతా ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వైద్య బృందాలు, 108 అంబులెన్స్, ప్రథమ చికిత్స కేంద్రం, అగ్నిమాపక వాహనా లు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు భద్రత తదితర ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ నిబంధ నలకు అనుగుణంగా అత్యంత గౌరవప్ర దంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా ప్రతి శాఖ ప్రత్యేక ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న పథకాల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలను ప్రతిబింబించే విధంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచిం చారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు కార్యాచరణకు టీయూడబ్ల్యూజే-ఐజేయూ శ్రీకారం

- **అర్హులందరికీ ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులే లక్ష్యం**
- **అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల నిర్ణయంఅన్ని నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటుకు తీర్మానం**
- **ఐక్యతతోనే జర్నలిస్టుల సంక్షేమం సాధ్యమని నాయకుల పిలుపు**

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 03,**

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తి భద్రత కోసం సమగ్ర కార్యాచరణ చేపట్టాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) సంగారెడ్డి జిల్లా శాఖ నిర్ణయించింది. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన సదాశివపేటలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ తొలి సమావేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ ముఖ్య అతిథిగా హాజరై యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని, క్రమశిక్షణ, ఐక్యత సంస్థకు బలమని సూచించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిం ది. జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డుల మంజూరు, యూనియన్ భవనం ఏర్పా టు, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధికారు లను, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలనే అంశాన్ని బలంగా వినిపించాలని సమావేశం అభిప్రాయపడింది. ఇంకా అక్రిడేషన్ కార్డులు అందని అర్హులైన జర్నలిస్టులకు తక్షణమే గుర్తింపు కార్డులు జారీ చేయాలని, కేబుల్ టీవీ జర్నలిస్టులకు ప్రత్యేక యూనిట్ ఆధారంగా అక్రిడేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేశారు. యూనియన్ విస్తరణలో భాగంగా సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, నారాయణఖేడ్, జోగిపేట, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని, హత్నూరులో కూడా త్వరలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనలో రాజీలేని పోరాటమే మార్గమని, సంఘటిత ఉద్యమాల ద్వారానే సంక్షేమం, అభివృద్ధి, వృత్తి గౌరవం సాధ్యమవుతాయని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో యూనియన్ నిరంతరం ముందుంటుందని, గతం నుంచి వృత్తి హక్కుల కోసం పోరాడుతూ వస్తోందని చెప్పారు. సంగారెడ్డిలో నిర్వహించిన జిల్లా మహాసభను విజయవంతం చేసిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. అనిల్ కుమార్ మాట్లాడుతూ నిరంతర శ్రమ, అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు తప్పకుండా లభిస్తుందని, యూనియన్ బలోపేతంలో ప్రతి సభ్యుడు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కోశాధికారి అన్వర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, కోశాధికారి శ్రీధర్ జైన్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్ధిక్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహన్, ఉపాధ్యక్షుడు నజీర్, కోశాధికారి లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు బాసిత్, ఐజేయూ సభ్యుడు సిద్ధన్న పాటిల్, సదాశివపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హాజీ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనాథ్, మతీన్, సత్యనారాయణ రెడ్డి, కిషోర్ మల్లేశం, సంయుక్త కార్యదర్శులు ఉల్లిగడ్డల శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి, సుమన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు విల్సన్, ఆంజనేయులు, ఉ ల్వల రాజు, సదాశివపేటకు చెందిన జర్నలిస్టులు నరేష్, విశ్వనాథ్, జయరాములు, లింగం, జహీరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మీనాజ్తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.







# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**పీజీఆర్ఎస్‌లో 189 వినతుల స్వీకరణ**

**పెండింగ్ అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి**

**భూ, సర్వే సమస్యలు, ఎరువుల పంపిణీ, ఫార్మ్ పాండ్స్ పనులపై జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ ఆదేశాలు**

విజయవాడ: ఆగస్టు 03: ప్రజల సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 189 వినతులు నమోదు కాగా, అందులో అత్యధికంగా 78 వినతులు రెవెన్యూ శాఖకు సంబంధించినవని తెలిపారు. ప్రజల నుండి అందిన ప్రతి వినతిని నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను ప్రత్యేక ప్రాధాన్యతతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యలపై స్పందన వేగవంతమైతేనే ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని అన్నారు. జిల్లాలో భూ వివాదాలు, సర్వే సమస్యలు, రెవెన్యూ అంశాలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నందున సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌ను నిరంతరం పరిశీలిస్తూ పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ 1100 టోల్ ఫ్రీ సేవ ద్వారా అందుతున్న ఫిర్యాదులను అత్యంత బాధ్యతతో పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి అర్జీదారుతో నేరుగా మాట్లాడిన అనంతరమే ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ప్రజల్లో 1100 సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క దరఖాస్తును కూడా నిర్లక్ష్యం చేయరాదన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను సక్రమంగా పరిష్కరించకపోవడం వల్ల ఒకే సమస్యపై పలుమార్లు అర్జీలు వస్తున్నాయని పేర్కొంటూ, నాణ్యమైన పరిష్కారాలపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. గత నవంబర్, డిసెంబర్ నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న భూ సర్వేలను వాతావరణం అనుకూలించిన వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో ప్రజల నుంచి అధిక సంఖ్యలో అర్జీలు కలెక్టరేట్‌కు రావడం స్థానిక స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారం సరిగా జరగడం లేదనే విషయాన్ని సూచిస్తోందన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం మండలాల వారీగా గ్రీవెన్స్ పరిష్కారాన్ని నిరంతరం సమీక్షిస్తోందని, ఆర్‌డీవోలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. భూమి సరిహద్దులు, రికార్డులు లేదా భూ హక్కులకు సంబంధించిన ప్రతి సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని, సమస్య చిన్నదైనా అత్యున్నత ప్రాధాన్యతతో చర్యలు



తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో ఎరువుల డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అన్ని ఎరువుల దుకాణాలు, సహకార సంఘాలు ఉదయం 6.00 గంటలకే ప్రారంభం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కువ మంది రైతులు వచ్చే కేంద్రాల వద్ద టెంట్లు ఏర్పాటు చేసి నీడతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రతి ఎరువుల దుకాణం, సొసైటీ వద్ద ధరల పట్టికతో పాటు కలెక్టరేట్ ఫోన్ నంబర్‌ను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. డివిజనల్ రెవెన్యూ అధికారులు, తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ ఎరువుల విక్రయాలను పర్యవేక్షిస్తూ అక్రమాలు, డైవర్షన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పెరుగుదలకు ఫార్మ్ పాండ్స్ కీలకమని పేర్కొన్న కలెక్టర్, వర్షాకాలం ప్రారంభమైనందున మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్స్ పనులను ప్రతి మండలంలో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాబోయే నెల రోజుల పాటు ఆర్‌డీవోలు, ఎంపీడీవోలు ఈ పనులను ప్రతిరోజూ పర్యవేక్షించి వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ఆత్కూరు గ్రామానికి చెందిన కౌలు రైతులు సాగుదారు హక్కు పత్రాలు (జజ=జ కార్డులు) అందలేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రీ-సర్వే ప్రక్రియకు సీసీఆర్సీ కార్డుల పంపిణీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సంబంధిత రైతులకు ఈరోజే సీసీఆర్సీ కార్డులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, రీ-సర్వే ప్రక్రియ వేరుగా కొనసాగుతుందని, సాగుదారు హక్కు కార్డుల మంజూరులో ఎలాంటి ఆలస్యం ఉండదని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహ, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి. జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రధాని మోడీపై మైనర్ బాలిక వ్యాఖ్యల కేసు

**క్షమించానని..కేసులతో వేదించమని ప్రధాని హామీ**

**కేసును వెనక్క తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసు ప్రకటన**

న్యూఢిల్లీ,ఆగస్ట్3 : నీట్ పేపర్ లీక్ ఆందోళనల్లో భాగంగా ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మైనర్ బాలికపై కేసును కొనసాగించబోమని దిల్లీ పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి. ఈ ఘటనకు సంబంధించి నోయిడా పోలీసులు ఇటీవల జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆమె వ్యాఖ్యలు ప్రధాని పదవిని అగౌరవపర్చేలా, శాంతియుత పరిస్థితులకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. అయితే, ప్రస్తుతం ఆ కేసును బాలికపై కొనసాగించడం లేదని పోలీసులు వెల్లడించారు. తన కుమార్తెపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు వయసు 25 ఏళ్లుగా నమోదు చేశారని.. కానీ, ఆమె వయసు 15 ఏళ్లే అని తన తల్లి చెప్పిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ క్రమంలోనే బాలిక తల్లి తప్పు తెలుసుకుని ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. తన కుమార్తెను క్షమించి గొప్ప మనసు చాటుకున్నారని ఆమె ప్రధానిని కొనియాడారు. 18 ఏళ్లలోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను నిషేధించాలని ఆమె సూచించారు. చిన్నారులకు తెలియక సులభంగా ఇతరుల ప్రభావానికి లోనయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వారి దృష్టి చదువులపైనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జంతర్‌మంతర్ నిరసనల సందర్భంగా ప్రధానిని ఉద్దేశించి అసభ్యపదజాలంతో మాట్లాడిన బాలికపై కేసు పెట్టవద్దని ఢిల్లీ పోలీసులు నిర్ణయించినట్టు జాతీయ మీడియాలో కూడా కథనాలు వెలువడ్డాయి. ఈ ఉదంతానికి సంబంధించి తొలుత నోయిడా పోలీసులు జీరో

ఎఫ్ఐఆర్ ఫైల్ చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ పోలీసులు ఈ ఉదంతంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బాలిక ప్రధానికి క్షమాపణ చెబుతూ వీడియో రిలీజ్ చేసింది. తనకు 15 ఏళ్లేనని, నిరసన వద్ద ఇతరుల ప్రభావానికి లోనై అలాంటి వ్యాఖ్యలు చేశానని వివరణ ఇచ్చుకుంది. ఇది తన చివరి తప్పిదమని కూడా చెప్పింది. ఈ క్రమంలో ప్రధాని మోదీ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తప్పుదారి పట్టిన పిల్లలను క్షమించాలని అభిప్రాయపడ్డారు. వారిని శిక్షించడం, కోర్టుల చుట్టూ తిప్పడం వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు. బాలిక తల్లి కూడా ఈ ఉదంతంపై



స్పందించారు. తన కుమార్తెను క్షమించిన ప్రధాని ఆమెకు జీవనదానం చేశారని అన్నారు. బాలికపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా వాడకుండా మైనర్లపై నిషేధం ఉండాలని కూడా అభిప్రాయపడ్డారు. అయితే తన కుమార్తెను ప్రధాని క్షమించినా పోలీసులు ఇంకా ఎఫ్ఐఆర్‌ను వెనక్కు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక చేసిన తప్పునకు పశ్చాత్తాపడుతోందని చెప్పారు. తప్పుదారి పట్టిన చిన్నారులను క్షమించాలని, సక్రమమార్గంలో నడిపించాలని ప్రధాని చెప్పినా పోలీసులు ఇంకా ఎఫ్ఐఆర్ వెనక్కు తీసుకోలేదని అన్నారు. పెద్దల విషయంలో తన కూతురు అసభ్య పదజాలం వాడి ఉండాల్సింది కాదని అన్నారు. నిరసన తెలిపేందుకు, వివిధ వేదికల్లో తమ అభిప్రాయాలను వినిపించేందుకు యువతకు హక్కు ఉన్నప్పటికీ అసభ్య భాష మాత్రం వాడకూడదని బాలిక తల్లి అభిప్రాయపడ్డారు. పుట్టిన రోజుకోసం దుస్తులు కొనుక్కుంటానని జులై 23న తన కుమార్తె బయటకు వెళ్లిందని చెప్పారు. ఆమె వైరల్ వీడియోను బంధువులు పంపించాకే ఈ విషయం తమకు తెలిసిందని చెప్పారు. 'ఘటన గురించి వెలుగులోకి వచ్చాక మేము ముఖం దాచుకుని బయటకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో ఉన్న ప్రాంతం నుంచి మేము మరో చోటకు మారిపోయాము. తరచూ మకాం మార్చాల్సి వస్తోంది. బాలిక మైనర్ అని ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. కానీ ఆమెపై ఎఫ్ఐఆర్ మాత్రం ఇంకా వెనక్కు తీసుకోలేదు' అని బాలిక తల్లి తెలిపారు. బాలిక కూడా క్షమాపణ చెప్పిన విషయాన్ని పేర్కొన్నారు. 'ప్రధాని స్వయంగా ఆమెను క్షమించినప్పుడు పోలీసులు కూడా కేసు క్లోజ్ చేసి ఎఫ్ఐఆర్‌ను వెనక్కు తీసుకోవాలి' అని అభ్యర్థించారు. తమకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని కూడా స్పష్టం చేశారు.



# సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంపు

**బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం**

న్యూఢిల్లీ,ఆగస్ట్3 : లోక్‌సభలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026 ఆమోదం పొందడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో దాదాపు లక్ష పెండింగ్ కేసులు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కేంద్రం చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్క సంవత్సరంలో 65 వేల కేసులను డిస్పోజ్ చేస్తే.. 75 వేల కొత్త కేసులు నమోదవుతున్నాయని ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు. దీంతో కేసుల విచారణను వేగవంతం చేయాలనే లక్ష్యంతోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లును కేంద్రం తీసుకొచ్చిందని రఘునందన్ రావు చెప్పుకొచ్చారు. జడ్జిల సంఖ్య పెంపుతో కక్షిదారులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఎంపీ రఘునందన్ రావు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2019లో ఒకసారి, ఇప్పుడు మరోసారి జడ్జిల సంఖ్య పెంచారని తెలిపారు. దేశ ప్రజలకు వేగంగా న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే ఈ బిల్లులను కేంద్రం తీసుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కేంద్రం రూ.7 వేల కోట్లు ఖర్చు చేసిందని ప్రశంసించారు. కొలిజియం విధానానికి వ్యతిరేకంగా సర్వీస్ కమిషన్ తీసుకురావాలని గతంలో ప్రయత్నం జరిగిందని, అయితే సుప్రీంకోర్టు దానిని కొట్టివేసిందని రఘునందన్ రావు గుర్తు చేశారు. కొలిజియంలో మరింత పారదర్శకత అవసరమని, అందుకోసం జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను దేశ ప్రజల అభిప్రాయంగా తాను భావిస్తున్నానని, వాటిని స్వాగతిస్తున్నట్లు రఘునందర్ రావు పేర్కొన్నారు. ఆయన అభిప్రాయానికి అనుగుణంగా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఇ-20 పెట్రోల్ అంశంపైనా ఎంపీ స్పందించారు. ఇ-20తో లాభాలు ఉన్నాయని చెప్పిన ఆయన.. త్వరలోనే అపోహలపై స్పష్టత ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# విద్యార్థులపై నమోదైన కేసులు వెనక్కి

**ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు**

**సుప్రీంకోర్టుకు వివరించిన కేంద్ర ప్రభుత్వం**

న్యూఢిల్లీ,ఆగస్ట్3 : జంతర్‌మంతర్ వద్ద గత నెలలో విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్ ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం



మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. ఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తోంది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.



# కశ్మీరీ ఎంఎంఏ ఫైటర్ సత్తా

## ప్రపంచ ఛాంపియన్ అయిన ఫైటర్‌ను ఓడించిన ఓవైస్ యాకూబ్

**అంతర్జాతీయ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ) యవనికపై ఓ భారతీయ యువకుడు సంచలనం సృష్టించాడు. జమ్మూ కశ్మీర్‌కు చెందిన ఓవైస్ యాకూబ్, బల్గేరియాలో జరిగిన ప్రతిష్ఠాత్మక బ్రేవ్ సీఎఫ్ 107 ఈవెంట్‌లో అద్భుత విజయాన్ని నమోదు చేశాడు.**

**ఇప్పటివరకు ఓటమి ఎరుగని, రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన బల్గేరియా ఫైటర్ డెల్యన్ జార్జివ్‌ను మట్టికరిపించి చరిత్ర సృష్టించాడు. ఈ విజయం పట్ల జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హర్షం వ్యక్తం చేస్తూ ఓవైస్‌కు అభినందనలు తెలిపారు.**

ఒమర్ అబ్దుల్లా కార్యాలయం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. "బల్గేరియాలో అజేయ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించి అద్భుత విజయం సాధించిన జమ్మూ కశ్మీర్ ఎంఎంఏ ఫైటర్ ఓవైస్ యాకూబ్‌కు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఇది జమ్మూ కశ్మీర్‌తో పాటు దేశానికే గర్వకారణం. భవిష్యత్తులోనూ అతను మరిన్ని విజయాలు సాధించి, అంతర్జాతీయ వేదికపై దేశ కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు" అని పేర్కొంది. ఆగస్టు 1న బల్గేరియాలోని బుర్గాస్ ఎరీనాలో జరిగిన ఈ పోరులో ఓవైస్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. మొదటి రౌండ్ ప్రారంభమైన కేవలం 4 నిమిషాల్లోనే టెక్నికల్ నాకౌట్ (టీకేఓ) ద్వారా డెల్యన్ జార్జివ్‌ను ఓడించి తన కెరీర్‌లో చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. ఈ ఓటమితో జార్జివ్ కెరీర్‌లో తొలి పరాజయం నమోదైంది. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లా మురాన్ గ్రామానికి చెందిన ఓవైస్, ఈ పోరులో అద్భుతమైన నిలకడ, పట్టుదల, సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు పొందాడు. విజయం అనంతరం ఓవైస్ యాకూబ్ మాట్లాడుతూ.. "ఈ విజయం నాకు సర్వస్వం. నా కుటుంబం, జమ్మూ కాశ్మీర్ ప్రజలు, యావత్ దేశం ఆశలను మోస్తూ నేను బరిలోకి దిగాను. అజేయ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించడం ఒక కల నిజమైన క్షణం. అయితే ఇది ఆరంభం మాత్రమే. మరింత కష్టపడి పనిచేసి, ప్రపంచ వేదికపై గర్వంగా భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ మరిన్ని విజయాలు సాధిస్తాను" అని అన్నాడు. గతంలో కశ్మీర్ నుంచి పలువురు రెజ్లర్లు జాతీయ స్థాయిలో రాణించినప్పటికీ, ఎంఎంఏ క్రీడలో ఓవైస్ సాధించినటువంటి అంతర్జాతీయ మైలురాయిని ఇంతవరకు ఎవరూ చేరుకోలేదు.



# అమెరికా క్రికెటర్ అఖిలేశ్ రెడ్డిపై నిషేధం

అంతర్జాతీయ క్రికెట్‌లో మరో అవినీతి ఉదంతం కలకలం రేపింది. అమెరికా (యూఎస్‌ఏ) క్రికెటర్ బొడుగం అఖిలేశ్ రెడ్డిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఎనిమిదేళ్ల పాటు నిషేధం విధించింది. 2025లో జరిగిన అబుదాబి టీ10 లీగ్‌లో అఖిలేశ్ రెడ్డి అవినీతి నిరోధక నియమావళిని ఉల్లంఘించినట్లు తేలడంతో ఐసీసీ ఈ కఠిన చర్యలు తీసుకుంది. ఈ నిషేధం 2025 నవంబర్ 21 నుంచే అమల్లోకి వచ్చినట్లు ఐసీసీ వెల్లడించింది. ఐసీసీ యాంటీ కరప్షన్ ట్రిబ్యునల్ విచారణలో అఖిలేశ్ రెడ్డిపై మూడు ప్రధాన ఆరోపణలు రుజువయ్యాయి. టీ10 లీగ్‌లో మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం, సహచర ఆటగాడిని ఉద్దేశపూర్వకంగా ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరడం, విచారణను అడ్డుకునే ఉద్దేశంతో తన ఫోన్‌లోని వాట్సాప్ సందేశాలు, కాల్ లాగ్‌లను డిలీట్ చేయడం వంటి నేరాలకు పాల్పడినట్లు ట్రిబ్యునల్ నిర్ధారించింది. 2025 నవంబర్ 19న అస్పిన్ స్టాలియన్స్ జట్టు తమ తొలి మ్యాచ్ ఆడటానికి ముందురోజు, అఖిలేశ్ రెడ్డి హోటల్ గదిలో తన సహచర బౌలర్‌ను కలిసి, ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరాడు. టీమ్ మేనేజ్‌మెంట్ సూచన మేరకే తాను ఇలా అడుగుతున్నట్లు అతడిని నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, సదరు ఆటగాడు ఇందుకు నిరాకరించి, ఈ విషయాన్ని వెంటనే ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ దృష్టికి తీసుకెళ్లాడు. విచారణలో భాగంగా ఫోన్‌లోని డేటాను డిలీట్ చేయడంపై అఖిలేశ్ ఇచ్చిన వివరణలను ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. 26 ఏళ్ల అఖిలేశ్ రెడ్డి అమెరికా తరపున ఇప్పటివరకు నాలుగు టీ20 మ్యాచ్‌లు ఆడాడు.

# ఆసీస్ జట్టులో భారత సంతతి సంచలనం నీల్ పటేల్



భారత అండర్-19 జట్టుతో తలపడేందుకు ఆస్ట్రేలియా తమ 16 మంది సభ్యులతో కూడిన అండర్-19 జట్టును ప్రకటించింది. వచ్చే నెలలో జరగనున్న ఈ పర్యటనలో భారత సంతతికి చెందిన యువ సంచలనం నీల్ పటేల్‌కు చోటు దక్కడం విశేషం. ఈ టూర్‌లో భాగంగా ఆస్ట్రేలియా జట్టు టీమిండియా అండర్-19తో రాజ్‌కోట్, అహ్మదాబాద్ వేదికలుగా మూడు 50 ఓవర్ల మ్యాచ్‌లు, రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడనుంది. ఫాస్ట్ బౌలర్లు విల్ బైరమ్, కాసే బార్టన్‌లు ఈ జట్టు పేస్ దళాన్ని నడిపించనున్నారు. ఈ పర్యటనలో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఆటగాడు నీల్ పటేల్. యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (యూఎన్ఎస్‌డబ్ల్యూ) క్రికెట్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నీల్, కేవలం 16 ఏళ్ల వయసులోనే సిడ్నీ ప్రీమియర్ క్రికెట్ ఫస్ట్ గ్రేడ్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 1000కి పైగా పరుగులు చేసి రికార్డు సృష్టించాడు. ఇంత చిన్న వయసులోనే ఈ ఘనత సాధించిన అతికొద్ది మంది ఆటగాళ్లలో ఒకడిగా నిలిచి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఇప్పుడు భారత గడ్డపై తన ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నాడు. జట్టులోని ఇతర ముఖ్య ఆటగాళ్లలో విల్ బైరమ్, కాసే బార్టన్‌లు ఉన్నారు. ఈ ఏడాది జింబాబ్వేలో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిధ్యం వహించినది వీరిద్దరే కావడం గమనార్హం. ఆ టోర్నీలో 17 ఏళ్ల బైరమ్ కేవలం 10.50 సగటుతో 10 వికెట్లు పడగొట్టి అద్భుతంగా రాణించాడు. బార్టన్ కూడా నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అయితే, ఆ ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా సెమీ-ఫైనల్‌లో ఇంగ్లండ్ చేతిలో 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. భారత పర్యటనపై క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) జాతీయ అభివృద్ధి విభాగం హెడ్ సోన్యా థాంప్సన్ మాట్లాడుతూ.. "ఆస్ట్రేలియాలోని అత్యుత్తమ యువ క్రికెటర్ల అభివృద్ధికి ఈ పర్యటన ఒక గొప్ప అవకాశం.

# జమ్మూకశ్మీర్ పేసర్ అకీబ్ నబీకి పిలుపు

దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆల్‌రౌండర్ అకీబ్ నబీకి భారత టెస్టు జట్టులో తొలి అవకాశం లభించింది. శ్రీలంకతో సిరీస్‌కు గాయంతో జస్‌ప్రీత్ బుమ్రా దూరం కావడంతో అతడి స్థానంలో సెలెక్టర్లు నబీని ఎంపిక చేశారు. దీంతో భారత పురుషుల టెస్టు జట్టుకు ఎంపికైన తొలి జమ్మూకశ్మీర్ క్రికెటర్‌గా అకీబ్ నబీ రికార్డు సృష్టించాడు. శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. బుమ్రా ఎడమ మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో సిరీస్‌కు దూరమవ్వాల్సి వచ్చింది. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గాయపడిన బుమ్రా ఫిట్‌నెస్ సాధిస్తేనే జట్టులో కొనసాగుతాడని ముందే బీసీసీఐ ప్రకటించింది. అయితే పూర్తిగా కోలుకోకపోవడంతో అతణ్ని తప్పించి అకీబ్ నబీకి అవకాశం కల్పించింది. 29 ఏళ్ల కుడిచేతి ఫాస్ట్‌బౌలింగ్ ఆల్‌రౌండర్ అకీబ్ నబీ దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ఫామ్‌తో ఈ అవకాశాన్ని అందుకున్నాడు. గత రంజీ ట్రోఫీ సీజన్‌లో ఏకంగా 60 వికెట్లు పడగొట్టి జమ్మూకశ్మీర్‌కు తొలి టైటిల్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. గత రెండు రంజీ సీజన్లలో కలిపి 104 వికెట్లు సాధించి తన స్థిరమైన ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. అదే ఫామ్ ఇప్పుడు జాతీయ జట్టులో చోటు కల్పించింది. దేశవాళీ ప్రదర్శన ఆధారంగా ఐపీఎల్-2026లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున కూడా నబీకి అవకాశం దక్కింది. ఐదు మ్యాచ్‌లు ఆడినా వికెట్లు మాత్రం సాధించలేకపోయాడు. ఇటీవల శ్రీలంక పర్యటనకు వెళ్లిన ఇండియా-ఏ జట్టులో చోటు దక్కించుకున్న అతడు ఆరు వికెట్లు తీశాడు. ఆ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది. అంతకుముందు ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు నెట్ బౌలర్‌గా భారత జట్టుతో ఉన్న అనుభవం కూడా అతడికి ఉంది. అకీబ్ నబీ ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో దులీప్ ట్రోఫీ కోసం సాధన చేస్తున్నాడు. ఇప్పుడు అక్కడి నుంచి ముంబై చేరుకుని భారత జట్టుతో కలవనున్నాడు. ఆ తర్వాత జట్టు కొలంబోకు బయలుదేరుతుంది. ఆగస్టు 7 నుంచి 9 వరకు మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడిన తర్వాత గాలేలో జరిగే తొలి టెస్టులో బరిలోకి దిగుతుంది. తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి, రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరుగుతుంది. ఈ సిరీస్‌లో మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్‌తో కలిసి నబీ భారత పేస్ దళంలో భాగం కానున్నాడు.



# భువీనే నం.1: అర్ష్‌దీప్



భారత యువ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, తన దృష్టిలో అత్యుత్తమ ఐదుగురు భారత బౌలర్ల జాబితాను ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ జాబితాలో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు అగ్రస్థానం ఇవ్వగా, ప్రపంచంలోని మేటి బౌలర్లలో ఒకడిగా పేరున్న జస్ప్రీత్ బుమ్రాకు చోటు కల్పించకపోవడం చర్చనీయాంశమైంది. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అర్ష్‌దీప్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భువనేశ్వర్ కుమార్ తన వ్యక్తిగత ఫేవరెట్ అని, అందుకే అతడికి మొదటి స్థానం ఇచ్చానని అర్ష్‌దీప్ స్పష్టం చేశాడు. కొత్త బంతితో అతడి నియంత్రణ అద్భుతంగా ఉంటుందని ప్రశంసించాడు. "భువీ భాయ్ నా ఫేవరెట్ కాబట్టి అతడికే అగ్రస్థానం. ఈ విషయంలో నేను కొంచెం పక్షపాతంతో ఉన్నాను" అని నవ్వుతూ చెప్పాడు. ఈ జాబితాలో రెండో స్థానంలో మహమ్మద్ షమీని ఎంచుకున్నాడు. ఏ వికెట్‌పైనైనా బంతిని సీమ్ చేయగల సత్తా షమీకి ఉందని, అతడి బౌలింగ్, సీమ్ ప్రెజెంటేషన్ అద్భుతంగా ఉంటుందని కితాబిచ్చాడు. ఆ తర్వాత స్పిన్నర్లకు ప్రాధాన్యత ఇచ్చాడు. అరుదైన నైపుణ్యం ఉన్న లెఫ్ట్ ఆర్మ్ చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌కు మూడో స్థానం కట్టబెట్టాడు. నాలుగో స్థానంలో యుజ్వేంద్ర చాహల్‌ను నిలిపాడు. చాహల్ తనకు పంజాబ్ జట్టు సహచరుడని, అతడి రికార్డు కూడా అద్భుతంగా ఉందని పేర్కొన్నాడు. ఇక, ఐదో స్థానంలో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను ఎంచుకున్నాడు.

# బూతులు వద్దు: మనూభాకర్



ఒలింపిక్ షూటర్ మనూ భాకర్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఓ మెసేజ్ పోస్టు చేశారు. చెడు భాష గురించి ఆమె తన మెసేజ్‌లో యువతకు సందేశం ఇచ్చారు. చెడుగా మాట్లాడడం మానుకోవాలని ఆమె యువతను కోరారు. తిట్టుకోవడం, దుర్భాషలాడడం .. మంచి పద్ధతి కాదు అని ఆమె అన్నారు. మీరు మాట్లాడే మాటలే మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తాయన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన షూటర్ మనూ భాకర్.. తన ఎక్స్ అకౌంట్‌లో సుదీర్ఘ సందేశాన్ని పోస్టు చేశారు. మీ భాషే మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తుందని, మీరెలాంటి వాళ్లో చెబుతోందని, మీ పదాలను తెలివిగా ఎంచుకోవాలని, ఎందుంటే మీరు అనుకున్నట్లే మీరు తయారు అవుతారన్నారు. చెడు భాషను వాడడం మంచి పద్ధతి కాదు అని, దుర్భాషలాడడం మానుకోవాలన్నారు. అలా చేస్తే నిర్మలంగా ఉండలేరన్నారు. కూల్‌గా ఉండడం అంటే హార్డ్ వర్క్ చేయడమే అని, దయతో ఉండాలని, ఇతరుల పట్ల గౌరవాన్ని చూపాలన్నారు. మంచితనంతో విజయం సాధించాలన్నారు. మీ పేరెంట్స్, దేశాన్ని గర్వంగా నిలపాలన్నారు. ఈ విషయాన్ని మీకెందుకు చెబుతున్నానంటే, గత కొన్నేళ్ల నుంచి .. చెడు భాషను వాడుతున్న తీరు మారిందన్నారు. చాలా మంది చాలా సాదాసీదాగా చెడు మాటలు మాట్లాడుతున్నారని, దాన్నే కూల్‌గా భావిస్తున్నారని, రోజువారీ మాటల్లో అమర్యాదకర భాషను వాడుతున్నట్లు షూటర్ మనూ భాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తిట్టడం అంటే కూల్‌గా ఉండడం కాదన్నారు.

# అథ్లెట్లను ప్రశంసించలేదేం?

## రాహుల్ గాంధీని ప్రశ్నించిన బాక్సర్ విజేందర్ సింగ్

ఒలింపిక్ పతక విజేత, ప్రముఖ బాక్సర్ విజేందర్ సింగ్.. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ రాహుల్ గాంధీ నుంచి కనీసం ఒక్క అభినందన సందేశం కూడా రాకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. క్రీడా విజయాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఈ మేరకు విజేందర్ సింగ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో ఒక పోస్ట్ చేశారు. "రాహుల్ గాంధీ జీ, కాంగ్రెస్ పార్టీ తరచూ దేశ యువత గురించి మాట్లాడుతుంది. కానీ కామన్వెల్త్ గేమ్స్‌లో మన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిస్తే మీ నుంచి ఒక్క అభినందన సందేశం కానీ, ట్వీట్ కానీ రాలేదు. దేశ యువత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగరేస్తున్నప్పుడు, మనం కూడా రాజకీయాలకు అతీతంగా వారి నైతిక స్థైర్యాన్ని పెంచడం మనందరి బాధ్యత" అని విజేందర్ తన పోస్టులో పేర్కొన్నాడు. గ్లాస్గోలో ముగిసిన 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలతో మొత్తం 39 పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలిచింది.



# ఒత్తిడి గొప్పగా తీర్చిదిద్దాయి

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తాను ఎదుర్కొన్న అనుభవాలు, డ్యాన్స్ నేర్చుకోవాల్సిన పరిస్థితి ఎలా ఏర్పడిందో తమన్నా వివరించారు. చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఎలాంటి శిక్షణ లేకుండానే డ్యాన్స్‌ను ఒక సర్వైవల్ స్కిల్ గా మార్చుకున్నానని తెలిపారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న ప్రారంభ రోజులను గుర్తు చేసుకున్నారు. భారీ సెట్లు.. వందలాది మంది టెక్నీషియన్ల మధ్య ఎలాంటి ముందస్తు రిహార్సల్స్ లేకుండానే పాటల్లో నటించాల్సి వచ్చేదని తమన్నా పేర్కొన్నారు. అప్పట్లో భయపడటానికి సమయం లేదని, కేవలం నేర్చుకోవడానికి మాత్రమే అవకాశం ఉండేదని వెల్లడించారు. ఆ నాటి కఠినమైన షెడ్యూల్స్ .. నిరంతర ఒత్తిడే తనను అద్భుతమైన పెర్ఫార్మర్‌గా తీర్చిదిద్దాయని అభి ప్రాయపడ్డారు. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'ది బాస్టర్డ్స్ ఆఫ్ బాలీవుడ్' లోని 'ఘఫూర్' పాట షూటింగ్ సమయంలోనూ ఇలాంటి సవాళ్లను ఎదుర్కొన్నట్లు తెలిపారు.



# కియారాపై ట్రోలింగ్



పాన్ ఇండియా స్టార్ యశ్ హీరోగా నటిస్తోన్న 'టాక్సిక్' చిత్రానికి సంబంధించి సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తోన్న సంగతి తెలిసిందే. సినిమాలోని ఇంటిమేట్ సన్నివేశాల నేపథ్యంలో కియారా అద్వానీపై సోషల్ మీడియా వేదికగా కొందరు నెటిజన్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సినిమాలోని పాత్రల డిమాండ్ మేరకు నటించే నటులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం దురదృష్ట కరమని విశ్లేషకులు భావిస్తున్నారు. తాజాగా ఈ పరిణామాలపై హ్యూమా ఖురేషి ట్రోలర్స్ తీరును తీవ్రంగా ఖండించారు. నటీనటులు కేవలం దర్శకుడి దృష్టికి అనుగుణంగా కథ డిమాండ్ చేసిన మేరకు పాత్రకు పూర్తి న్యాయం చేయడానికి ప్రయత్నిస్తారని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యూస్, లైక్స్ కోసం కొందరు వ్యక్తులు మహిళా నటులను టార్గెట్ చేస్తూ దిగజారుడు కామెంట్లు చేయడం సిగ్గుచేటని హ్యూమా ఖురేషీ మండిపడ్డారు. కళా రంగంలో పనిచేస్తున్న మహిళలపై ఇలాంటి ఆన్‌లైన్ దాడులు పెరగడం సమాజంలో అనారోగ్యకరమైన ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. కేవలం సంచలనం సృష్టించాలనే ఉద్దేశంతో కొందరు చేసే విమర్శలు నటుల వ్యక్తిగత జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నెగెటివిటీని నటీనటులు ఎంతమాత్రం సహించకూడదని, అందరూ కలిసి దీనికి వ్యతిరేకంగా గళం విప్పాలని పిలుపునిచ్చారు. సమకాలీన సినీ పరిశ్రమలో నటీమణులు తమకు నచ్చిన వైవిధ్యమైన పాత్రలను ఎంచుకునే స్వేచ్ఛ ఉందని అయితే దానిని తప్పుపట్టే సంస్కృతి మారాలని పలువురు సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

# బలవంతపు సెలవు: రష్మిక

ప్రముఖ నటి రష్మిక మందన్న ఇటీవల తాను షూటింగ్ లో గాయపడడంపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తాను నటిస్తున్న 'మైసా' సినిమాలోని ఓ డ్యాన్స్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని తెలిపారు. తన గాయం గురించి, విశ్రాంతి గురించి వివరిస్తూ సోమవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. "గాయాలు చాలా బాధిస్తాయి. ఈ విషయం ఎవరికీ తెలియకూడదని నేను నిజంగా ఆశించాను. కానీ, ఇప్పుడు అందరికీ తెలిసింది. ఇన్ని రోజులు కనిపించనందుకు క్షమించండి. నేను మళ్ళీ వచ్చేశాను. ఇది జరిగి కొంతకాలం అయింది. వరుసగా ఇది నాకు మూడో గాయం. నా శరీరాన్ని యంత్రంలా కాకుండా, మనిషి శరీరంలా చూడటం నేను కచ్చితంగా నేర్చుకోవాలి" అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తన గాయం తీవ్రతను వివరిస్తూ, "ఈ గాయం గురించి ఎలా చెప్పాలంటే.. మన తుంటికి, కాలికి మధ్య నాలుగు టెండన్లు ఉంటాయి. వాటిలో నా కుడి వైపు ఉన్న ఒక టెండన్ తెగిపోయింది. అది మళ్లీ అతుక్కుంటేనే నేను కాలు పైకి ఎత్తగలను. 'మైసా' సినిమాలోని డ్యాన్స్ షూట్‌లో ఇది జరిగింది. నేను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో ఇదే అత్యంత అగ్రెసివ్ ఫిల్మ్ అని చెప్పొచ్చు. కానీ కంగారు పడకండి. నొప్పి ఉన్నా భరించలేనిది ఏమీ కాదు" అని ఆమె వివరించారు. ఈ గాయాన్ని దేవుడు తనకు బలవంతంగా ఇచ్చిన సెలవుగా భావిస్తున్నానని రష్మిక పేర్కొన్నారు.





# 25 ఏళ్లలో ఎన్నో మధుర జ్ఞాపకాలు

యాక్షన్ హీరో గోపీచంద్ చిత్ర పరిశ్రమలో 25 ఏళ్ల మైలురాయిని పూర్తి చేసుకున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని పురస్కరించుకుని ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా ఒక భావోద్వేగపూరిత లేఖను పంచుకున్నారు. తన తండ్రి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ ప్రస్థానంలో తనకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. "నాన్నగారి ఆశీస్సులతో మొదలైన నా సినీ ప్రయాణానికి 25 ఏళ్లు" అంటూ గోపీచంద్ తన లేఖను ప్రారంభించారు. ఈ పాతికేళ్ల ప్రయాణంలో తనకు అవకాశాలిచ్చిన నిర్మాతలు, దర్శకులు, రచయితలు, సహ నటీనటులు మరియు సాంకేతిక నిపుణులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కెరీర్ ఆరంభం నుంచి నేటి వరకు తనకు అండగా నిలిచిన అభిమానులకు, మీడియా మిత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర భాషల ప్రేక్షకులు, ప్రతి హీరో అభిమానులు తనపై చూపిన ఆదరణను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

# 3 నెలల్లోనే 25 కిలోలు తగ్గింది!

డెలివరీ తర్వాత బరువు తగ్గడం చాలా మంది మహిళలకు పెద్ద సవాల్‌గా మారుతుంది. ముఖ్యంగా ట్విన్స్ కు జన్మనిచ్చిన తర్వాత శారీరకంగా కోలుకోవడం, పిల్లల సంరక్షణ, నిద్రలేమి వంటి కారణాలతో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడం అంత ఈజీ కాదు. అయితే కన్నడ టెలివిజన్ నటి ఐశ్వర్య సలీమత్ తన పోస్ట్ డెలివరీ ఫిట్‌నెస్ జర్నీతో ఇప్పుడు చర్చనీయాంశంగా మారారు. కేవలం మూడు నెలల్లోనే 90 కిలోల నుంచి 65 కిలోలకు చేరుకున్నట్లు ఆమె వెల్లడించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అగ్నిసాక్షి, రామాచారి, సేవంతి, సరయూ వంటి సీరియల్స్ ద్వారా గుర్తింపు పొందిన ఐశ్వర్య ప్రస్తుతం యాక్టింగ్ కు గ్యాప్ ఇచ్చి తన కవల పిల్లల సంరక్షణలో బిజీగా ఉన్నారు. గతేడాది డిసెంబర్‌లో ఐశ్వర్య, యాక్టర్ వినయ్ దంపతులకు కవలలు జన్మించారు. పిల్లల ఆరోగ్యంతో పాటు తన ఆరోగ్యాన్ని కూడా బ్యాలెన్స్ చేసుకోవాలనే ఆలోచనతో లైఫ్ స్టైల్ లో మార్పులు ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. బరువు తగ్గడానికి ఎలాంటి క్రాష్ డైట్‌ను ఫాలో అవలేదని, ఆహారపు అలవాట్లలో క్రమబద్ధమైన మార్పులే ప్రధాన కారణమని ఐశ్వర్య చెప్పడం విశేషం.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467